సాక్షి నిజామాబాద్

గురువారం । 9 । అక్టోబర్ । 2025



సేటు చెప్పిందే రేటు..

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకే మక్కలను అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు.

- 8లో ▸



పకడ్బందీ ఏర్పాట్లు

స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని సీపీ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /20.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. మబ్బులు కమ్ముకునే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 16 వరద గేట్ల ద్వారా 50 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో నీటి విడుదలను 25 వేల క్యూసెక్కులకు తగ్గించారు. మధ్యాహ్నం మళ్లీ ఇన్‌ఫ్లో పెరగడంతో అవుట్ ఫ్లోను పెంచారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయకాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1090.90(80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



నవీపేట: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఏర్పాటు చేసిన పోషణ్ మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారాన్ని తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వంటల పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, రాధలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

- సీపీ సాయిచైతన్య
- లక్కీ డ్రా విజేతల ప్రకటన



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల కోసం నిర్వహించిన ప్రత్యేక లక్కీ డ్రా విజేతలను సీపీ సాయిచైతన్య ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటి బహుమతి చంద్రయ్య (రూ.25 వేలు), ద్వితీయ బహుమతి షేక్ బాబర్ (రూ.15వేలు), తృతీయ బహుమతి రాంప్రసాద్ (రూ.10 వేలు) అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు ఎల్లప్పుడూ ప్రభుత్వ రవాణా సంస్థ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న మాట్లాడుతూ ప్రతి ప్రయాణికుడి సహకారమే సంస్థ విజయానికి మూలాధారమన్నారు. కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ యస్. మధుసూదన్, పీవోటీ పద్మజ, ఏవో పరమాత్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆనంద్ బాబు, డిపో మేనేజర్లు, అధికార సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

టీచర్ డిప్యుటేషన్ రద్దు చేయాలి

- బడికి తాళం వేసిన గ్రామస్తులు




ఇందల్వాయి: ఉపాధ్యాయురాలిని డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలకు పంపించడాన్ని నిరసిస్తూ డొంకల్ గ్రామస్తులు బుధవారం ప్రాథమికోన్నత పాఠశాలకు తాళం వేశారు. అనంతరం విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 37 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని, ఉపాధ్యాయురాలు అర్చన పిల్లలతో చనువుగా ఉంటూ చక్కగా పాఠాలు చెప్తున్నారనే తమ పిల్లలని పాఠశాలలో చేర్పించామన్నారు. ఇప్పుడు ఆ టీచర్‌నే డిప్యుటేషన్‌పై పంపించడం సరికాదన్నారు. టీచర్ డిప్యుటేషన్ రద్దు చేస్తేనే పాఠశాల తాళం తీసి విద్యార్థులను పంపుతామని వారు తెలిపారు.

స్థానిక పోరు.. మరింత టెన్షన్

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు నేటికి వాయిదా

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లపై హై కోర్టు తీర్పు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు తొలి విడత నోటిఫికేషన్ గురువారం నాడే విడుదల కానుండటం ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠను కలిగిస్తోంది. ఇది వరకే రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించింది. కోర్టు తీర్పుతో స్థానాలు మారితే తమ పరిస్థితి ఏమిటని రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు.



- నేడే 'స్థానిక' ఎన్నికల తొలి విడత నోటిఫికేషన్.. నామినేషన్ల ఘట్టం మరూ
- బరిలో ఉండే ఆశావహుల్లో డైలమా..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కేసులో హై కోర్టు తీర్పు గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేయడంతో ఆశావహుల్లో మరింత ఉత్కంఠ నెలకొంది. బుధవారం ఎన్నికలపై స్పష్టత వస్తుందనుకున్న అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులకు ఎదురు చూపులు తప్పలేదు. స్థానిక పోరుపై బంతి కోర్టులోనే ఉండగా, మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు తొలి విడత నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. కాగా, స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం ఉంటాయా.. లేదా అన్న విషయంలో సర్వత్రా టెన్షన్ కొనసాగుతోంది. బీసీ రిజర్వేషన్లపై కోర్టు తీర్పు వాయిదా వేయడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, జిల్లా ఎన్నికల అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

జిల్లాలో 31 జెడ్పీటీసీ స్థానాలు, 307 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు రెండు విడతల్లో పూర్తి చేసేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మొదటి విడతలో 18 మండలాలు, 177 ఎంపీటీసీ స్థానాలు, రెండో విడతలో 13 మండలాలు, 130 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండు విడతల్లో కలిపి 8,51,417 మంది ఓటర్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు ఆర్వోలు, పీవోలు, నోడల్ అధికారుల నియామకాలను చేపట్టింది. ఎన్నికల సామగ్రి ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయాలకు చేరాయి.

రిజర్వేషన్లు మారితే ..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుపై అటు ప్రభుత్వం.. ఇటు కోర్టు.. ఎన్నికల సంఘం తమదారిలో తాము ముందుకు వెళ్తుండటంతో ఆశావహులు డైలమాలో పడ్డారు. ఎటూ పాలుపోలేని పరిస్థితుల్లో ఉన్నారు. మరోవైపు తొలివిడత నామినేషన్లకు కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆశావహులు నేటి కోర్టు తీర్పు పట్ల ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. కాగా మహారాష్ట్రలో గతంలో ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టు రద్దు చేసిన అంశంపై సైతం చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరిగిన (అనధికారికంగా) నేపథ్యంలో మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన మాదిరే ఇక్కడ కూడా రద్దయితే ఎలా అంటూ ఆందోళన ఆశావహుల్లో నెలకొంది.

షెడ్యూల్ ప్రకారం..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం గురువారం తొలి విడత నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయాల్లో నామినేషన్లను స్వీకరించనున్నారు. 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు చివరి గడువు విధించారు. 12న నామినేషన్ల పరిశీలన, అదేరోజు చెల్లుబాటు అయిన అభ్యర్థుల జాబితా ప్రదర్శిస్తారు. 15న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు, ఆ తర్వాత పోటీ చేసే అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారు. తొలి విడత పోలింగ్ అక్టోబర్ 23న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. నవంబర్ 11న ఓట్లను లెక్కిస్తారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం

- మొదటి విడత నోటిఫికేషన్‌కు ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.

బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 9న నిజామాబాద్, బోధన్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 18 జెడ్పీటీసీలు, 177 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ ఇచ్చామన్నారు. నామినేషన్ల స్వీకరణకు అన్ని చర్యలు తీసుకున్నామని, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలను నియమించామని పేర్కొన్నారు.

తొలి విడతలో బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నవీపేట్, నిజామాబాద్, సిరికొండ జెడ్పీటీసీ స్థానాలతో పాటు, పై మండలాల పరిధిలోని 177 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు.

ఆర్వోలు, ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్స్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని మండలాల్లో ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ బృందాలను ఏర్పాటు చేసుకుని ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. పోస్టర్లు, బ్యానర్లు, గోడలపై రాతలను తొలగింప జేయాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో నిబంధనలను పాటించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సీసీ కెమెరాలు, గోడ గడియారాలు, ఓటర్ల జాబితా నిర్వహణ సక్రమంగా ఉండాలని, నామినేషన్ల సమయంలో వీడియోగ్రఫీ కచ్చితంగా ఉండాలన్నారు. నామినేషన్ సమయంలో అభ్యర్థులు సమర్పించాల్సిన అఫిడవిట్లు, ధ్రువపత్రాలు, ఇతర ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య తదితరులు



అలసి సొలసి నిద్రలోకి..

పంట సాగు మొదలుకుని దిగుబడిని అమ్ముకునే వరకు రైతుకు అడుగడుగునా కష్టాలే.. అందుకు నిదర్శనమే ఈ చిత్రం. రెంజల్ మండలం సాటాపూర్ – బోధన్ నేషనల్ హైవేపై మహిళా రైతు సోయాను ఆరబోసింది. ఎండ తీవ్రంగా ఉన్నా గొడుగు పట్టుకుని అక్కడే కూర్చుంది. కాసేపటికే అలసిపోయిన ఆమె రోడ్డు పైనే కునుకు తీస్తున్న దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఆర్వోబీ పనులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

- జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వెంటనే రాజీనామా చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేశ్ పటేల్ కులాచారి డిమాండ్
- ఆర్వోబీ వద్ద రాస్తారోకో



మాధవనగర్ ఆర్వోబీ వద్ద రాస్తారోకో చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పార్టీ నేతలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లా కేంద్రానికి ముఖద్వారంగా ఉన్న మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి ఆరోపించారు. బుధవారం ఆర్వోబీ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దినేశ్ మాట్లాడుతూ.. ఆ ర్వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.93 కోట్లు మంజూరు చేసిందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.10 కోట్ల నిధులు విడుదల చేయకపోవడంతో వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అశ్రద్ధను స్పష్టంగా చూపిస్తోందని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి లు ఆర్వోబీ పనులు పూర్తి చేయడం చేతకాకపోతే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆర్వోబీ వద్ద గుంతలతో ప్రమాదానికి గురైన ఓ మహిళ తనకు ఫోన్ చేసి రోడ్ల దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేసిందని తెలిపారు. ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న జిల్లా కలెక్టర్ సైతం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. బైపాస్ రోడ్డు నుంచి సాయిబాబా ఆలయం మీదుగా కమ్మ సంఘం వరకు సిమెంట్ సర్వీస్ రోడ్డు నిర్మిస్తే గుంతల వల్ల ఇబ్బందులు తప్పుతాయన్నారు. అనంతరం దినేశ్, బీజేపీ నాయకులు పక్కనే ఉన్న మొరం తీసి గుంతలను పూడ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతంకర్ లక్ష్మి నారాయణ, నాగోల్ల లక్ష్మి నారాయణ, న్యాలం రాజు, రూరల్ అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, కార్పొరేటర్ ప్రమోద్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓం సింగ్, ఉపాధ్యక్షులు రాజేశ్వర్, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు సతీష్ రెడ్డి, కార్యదర్శి జ్యోతి, జగన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు చంద్రకాంత్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎకరానికి రూ. కోటి పరిహారం..

- జాతీయ రహదారి 63లో కోల్పోనున్న భూములకు..
- పరిహారం నిర్ణయించిన రెవెన్యూ శాఖ
- రైతుల బ్యాంకు ఖాతా, ఇతర వివరాలను సేకరిస్తున్న అధికారులు
- గతంలో ఇచ్చిన పరిహారంతో పోలిస్తే ఫర్వాలేదంటున్న అధికార యంత్రాంగం



మోర్తాడ్ మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 63..



రహదారి విస్తరణలో కోల్పోనున్న వ్యవసాయ భూములు

మోర్తాడ్(బాల్కొండ): జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా కోల్పోతున్న భూములకు పరిహారాన్ని(అవార్డు) రెవెన్యూ యంత్రాంగం నిర్ణయించింది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూములకు ఎకరానికి రూ. కోటి చొప్పున, బైపాస్ రోడ్డు నిర్మించే ప్రాంతంలో ఎకరానికి రూ.40 లక్షల వరకూ పరిహారం చెల్లించాలని అధికార యంత్రాంగం ప్రతిపాదించి భూ సేకరణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, ఆర్మూర్ మండలాల్లో భూములను కోల్పోతున్న బాధిత రైతుల నుంచి బ్యాంకు ఖాతాలు, ఆధార్, పాన్‌కార్డు, వ్యవసాయ భూముల వివరాలను రెవెన్యూ యంత్రాంగం సేకరిస్తోంది.

కమ్మర్‌పల్లి శివారులోని భూములకు ఇప్పటికే అవార్డు నిర్ణయం తీసుకోగా రైతులకు సూచన ప్రాయంగా అధికారులు పరిహారం చెల్లింపు వివరాలను వెల్లడించారు. జగిత్యాల్ జిల్లా సరిహద్దులో ఉన్న గండి హనుమాన్ మందిరం నుంచి కమ్మర్‌పల్లి శివారులోని పాటి హనుమాన్ మందిరం వరకు జాతీయ రహదారిని వెడల్పు చేయనున్నారు. ఇక్కడ రహదారికి అనుకుని ఉన్న భూములను రోడ్డు విస్తరణ కోసం సేకరించనున్నారు. ఎకరానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. కమ్మర్‌పల్లిలోని నివాస, వ్యాపార భవనాలకు ఎలాంటి నష్టం లేకుండా చేయడానికి పాటి హనుమాన్ మందిరం నుంచి మోర్తాడ్ వైపు ఉన్న ఒక ఫంక్షన్ హాల్ వరకు బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ మార్గంలో నష్టపోతున్న భూమికి ఎకరానికి రూ.40 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. జాతీయ రహదారి విస్తరణ కోసం ఆర్మూర్ నుంచి కమ్మర్‌పల్లి వరకు 83.895 హెక్టార్ల భూమిని సేకరించడానికి హద్దులను గుర్తించారు. కమ్మర్‌పల్లిలో నష్టపోయే భూములకు అవార్డు నిర్ణయం పూర్తి కాగా మోర్తాడ్, అంక్సాపూర్, పడిగెల్, కుకునూర్‌లలో నష్టపోతున్న భూములకు కూడా పరిహారం నిర్ణయం జరుగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గతంలో నామమాత్రంగానే...

వరద కాలువ, రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించిన సమయంలో పరిహారం చెల్లింపులు నామమాత్రంగానే ఇచ్చారని విమర్శలు ఉన్నాయి. వరద కాలువ, రైల్వే లైన్ నిర్మాణంలో భూములను కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.1.45 లక్షల నుంచి రూ.3.24 లక్షల వరకు మాత్రమే ఇచ్చారు. అప్పట్లో వ్యవసాయ భూముల విలువ రూ.10 లక్షల వరకు పలికింది. ఇప్పుడు మాత్రం జాతీయ రహదారికి అనుకుని గ్రామానికి దగ్గరలో ఉన్న భూముల విలువ రూ.కోటికి మించి ఉంది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం భూముల విలువ తక్కువగానే ఉన్నా మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకుని పరిహారం నిర్ణయించడం విశేషం. వ్యవసాయ యోగ్యమైన భూముల ధరలు ఎక్కడైనా రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో జాతీయ రహదారికి దూరంగా ఉన్న భూములకు రూ.40 లక్షల చొప్పున పరిహారం నిర్ణయించడం గమనార్హం. ఏది ఏమైనా జాతీయ రహదారి విస్తరణలో రైతులకు పరిహారం నిర్ణయం ఆశాజనకంగా ఉందని అంటున్నారు.

భూమి దొరకడం లేదు



జాతీయ రహదారి విస్తరణలో భూమిని కోల్పోతున్న వారికి పరిహారం భారీగానే చెల్లించాలని నిర్ణయించినా వ్యవసాయ భూమిని కొనుగోలు చేద్దాం అంటే దొరకడం లేదు. భూమి కొరత తీవ్రంగా ఉంది. ధరలు ఆకాశాన్ని అంటడంతో ఒక ఎకరం కొనాలంటే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది.

– భావాల సంతోష్, రైతు, మోర్తాడ్

రైతుల నుంచి అన్ని వివరాలను సేకరిస్తున్నాం

జాతీయ రహదారి విస్తరణలో భూములను నష్టపోతున్న రైతుల నుంచి అన్ని వివరాలు సేకరిస్తున్నాం. అవార్డు నిర్ణయం జరుగడంతో రైతుల ఖాతాల వివరాలను నమోదు చేస్తున్నాం. నష్టపోయే భూమికి సంబంధించిన పరిహారం రైతుల ఖాతాల్లోనే జమ చేయనున్నారు. – కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

బంగారం భగభగ

- తులం బంగారం రూ.లక్షా 28 వేల 200



నిజామాబాద్ రూరల్: బంగారం, వెండి ధరల పరుగు ఆగడం లేదు. మంగళవారం తులం బంగారం రూ. 1,25,400 ఉండగా బుధవారం రూ. 1,28,200కు చేరుకొని రికార్డు సృష్టించింది. తులం వెం డి ధర రూ.1610కి చేరింది. దీపావళి పండుగ దాటేసరికి బంగారం ధర రూ. లక్షా 50 వేలకు చేరుకోవచ్చని బంగారు దుకాణాదారులు అభిప్రాయపడుతున్నారు. శుభకార్యాలు, పెళ్లిళ్ల కోసం పెద్ద మొత్తంలో కొనుగోలు చేయాల్సిన ప్రజలు ధరల పెరుగుదలతో తక్కువ బంగారంతోనే సరిపుచ్చుకుంటున్నారు. దీంతో కొనుగోళ్లు మందగించాయని దుకాణాదారులు చెప్తున్నారు.

రూ.లక్షా 50వేలు దాటుతుంది..



ఇంటర్నేషనల్ మార్కెట్‌లో బంగారం ధర హెచ్చు తగ్గులు ఉండడంతోనే బంగారం రేటు పెరుగుతోంది. రానున్న రోజుల్లో తులం బంగారం ధర రూ. లక్షా50వేలకు దాటేలా కనిపిస్తోంది. ఇలా ఉంటే సామాన్యుడికి చాలా ఇబ్బందే.

– లక్ష్మణచారి, వర్తకుడు, నగరవాసి

క్లుప్తంగా

ఇద్దరికి ఎస్సైలుగా పదోన్నతి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి లభించినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. నగరంలోని మూడో టౌన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న ఈశ్వర్, రెంజల్ ఏఎస్సైగా పనిచేస్తున్న గంగాప్రసాద్‌కి పదోన్నతి రాగా, బుధవారం సీపీని కలిశారు. ఈ సందర్భంగా సీపీ వారిద్దరినీ అభినందించి స్టార్‌లను ఏర్పాటు చేశారు. అయితే, ప్రమోషన్ పొందిన ఈశ్వర్, గంగా ప్రసాద్‌లను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు.

హోంగార్డులకు రెయిన్ కోట్‌లు



ఖలీల్‌వాడి: వర్షాకాలం, చలికాలంలో విధుల నిర్వహణలో ఇబ్బంది కాకుండా హోంగార్డులకు రెయిన్ కోట్‌లను అందజేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో జిల్లాలోని 362 మంది హోంగార్డులకు రెయిన్ కోట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెయిన్ కోట్‌లను సద్వినియోగం చేసుకోవాలని, విధి నిర్వహణ సమయంలో అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామచంద్రారావు, హోంగార్డ్స్ విభాగం రిజర్వ్ సీఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈడీ పరీక్షల్లో ఒకరు గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బుధవారం ప్రారంభమైన ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో జరిగిన ఈ పరీక్షలకు మొత్తం 29 మంది విద్యార్థులకు 28 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

ఆఫీసు లేని ఉద్యోగం

- ఇటీవల నియామకమైన జీపీవోల పరిస్థితి



డొంకేశ్వర్(ఆర్మూర్): ఇటీవల కొత్తగా విధుల్లో చేరిన గ్రామ పాలన అధికారులకు (జీపీవో) కార్యాలయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి ఉద్యోగాలిచ్చి కార్యాలయాలను సమకూర్చడం మరిచింది. గ్రామాల్లో ప్రత్యేక గదులు లేకపోవడంతో ప్రజలకు జీపీవోలు అందుబాటులో ఉండలేకపోతున్నారు. దీంతో తహసీల్ కార్యాలయాల్లోనే జీపీవోలు పనిచేయాల్సి వస్తోంది. తహసీల్ ఆఫీసుల్లో కూడా సరిపడా కుర్చీలు లేక కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఆఫీసులను సమకూర్చాలని జీపీవోలు కోరుతున్నారు.

వర్నిలో దొంగ నోట్ల కలకలం



వర్ని: మండలంలో దొంగ నోట్ల దర్శనం కలకలం సృష్టిస్తోంది. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 500 రూపాయల నోటును కిరాణా దుకాణంలో ఇవ్వగా సదరు యజమాని దానిని దొంగనోటుగా గుర్తించి తిరిగి ఇచ్చేశాడు. కాగా, బడాపహాడ్‌కు చెందిన వ్యక్తి ఒకరు తనకు రూ.50 వేలు ఇవ్వగా దానిలో ఈ దొంగ నోటు వచ్చినట్లు సదరు వ్యక్తి తెలిపారు. రెండు నెలలుగా వర్ని ప్రాంతంలో తరచూ దొంగ నోట్లు దర్శనమిస్తున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరి వద్దనైనా దొంగ నోట్లు వస్తే వాటిని చింపివేయాలని లేదా బ్యాంకు అధికారులకు అప్పగించాలని సూచించారు.

రుణ పంపిణీ లక్ష్యాలను సాధించాలి

- జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- గైర్హాజరైన బ్యాంకర్ల తీరుపై అసహనం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వచ్చే సీజన్‌లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు, రైస్‌మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు గురించి ఆరా తీశారు. ఈ సమావేశానికి పలువురు బ్యాంకర్లు గైర్హాజరు కావడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కీలక సమావేశానికి బ్యాంకర్లు రానప్పుడు, సమావేశం నిర్వహించి ప్రయోజనం ఏమిటని సంబంధిత అధికారులను నిలదీశారు. గైర్హాజరైన బ్యాంకర్ల గురించి మినిట్స్ బుక్‌లో పొందుపరిచి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు.

మిల్లర్లకు గ్యారెంటీలను మంజూరు చేయాలి

జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతమైనందున పంట రుణాల లక్ష్యాన్ని అధిగమించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు అర్హత కలిగిన రైస్ మిల్లర్లకు వెంటదివెంట బ్యాంకు గ్యారెంటీలను మంజూరు చేయాలని సూచించారు. కొత్త రైస్‌మిల్లర్లకు సైతం ప్రాపర్టీ మార్ట్‌గేజ్ చేసుకొని బ్యాంక్ గ్యారెంటీ అందించాలని అన్నారు. వ్యవసాయ శాఖతోపాటు డీఆర్డీఏ, మెప్మా, పశు సంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర శాఖలతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలని హితవు పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సునీల్, డీఆర్డీవో సాయాగౌడ్, నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్, ఆర్బీఐ ఎల్‌డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

స.హ.చట్టం అమలులో ఆదర్శంగా నిలవాలి

- దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్: పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఉద్దేశించిన సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ శాఖలలో సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాను ఆదర్శంగా నిలుపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఆర్‌టీఐ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. సబ్ కలెక్టర్లు, ఆర్డీవోల నేతృత్వంలో గురువారం నిజామాబాద్, బోధన్, ఆర్మూర్‌లలో డివిజనల్ స్థాయిలో, శుక్రవారం తహసీల్దార్ల ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఆయా శాఖల పీఐవోలు, ఏపీఐవోలు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి (పీఐవో), సహాయ పౌర సమాచార అధికారి (ఏపీఐవో), అప్పిలేట్ అధికారి వివరాలతో కూడిన సమాచార హక్కు చట్టం బోర్డును విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఆర్‌టీఐ అమలుకు సంబంధించి తప్పనిసరిగా రిజిస్టర్ ను నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వివరాలను పొందుపరచాలని సూ చించారు. 4(1బి) రిజిస్టర్లోని సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అన్ని కార్యాలయాలలో అందుబాటులో ఉంచాలని, పీరియాడికల్ రిపోర్ట్స్‌ను క్రమం తప్పకుండా సేకరించాలని, కనీసం మూడు మాసాలకు ఒకసారి ఆర్‌టీఐ అమలుపై సమీక్ష జరపాలన్నారు. దరఖాస్తుదారు రెండవ అప్పిలేట్ అథారిటీకి వెళ్లే ఆస్కారం లేకుండా కోరిన సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్‌లో అందించాలన్నారు. ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారంలో అనవసర కాలయాపన చేస్తే జరిమానాలకు గురి కావాల్సి వస్తుందని, ఇది పదోన్నతులు, ఇంక్రిమెంట్లు వంటి వాటిపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందన్నారు. రిసోర్స్ పర్సన్లు కిషన్, కృష్ణాజీ సమాచార హక్కు చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అకడమిక్ వాతావరణం నెలకొల్పాలి

- బయోమెట్రిక్ హాజరు అమలు
- వీసీ ప్రొఫెసర్ యాదగిరి



మాట్లాడుతున్న తెయూ వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో అకడమిక్ వాతావరణం నెలకొల్పడానికి అన్ని విభాగాల అధిపతులు కృషి చేయాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ యాదగిరిరావు సూచించారు. తన చాంబర్‌లో బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరితో కలిసి అని విభాగాల అధిపతులతో వీసీ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు వర్సిటీలో బయోమెట్రిక్ హాజరువిధానాన్ని పకడ్బందీగా అమలు చేయనున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం కళాశాలల్లో అడ్మిషన్స్ పొందిన విద్యార్థులకు పకడ్బందీగా తరగతులు నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితులలో పరీక్షలు వాయిదా వేయొద్దని, సమయానికి ఇంటర్నల్ ఎగ్జామ్స్, ప్రాక్టికల్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో వర్సిటీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్ గౌడ్, బీఈడీ కాలేజీ ప్రిన్సిపల్ సాయిలు, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్ కుమార్, ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రొఫెసర్ రాంబాబు, ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు, జెట్లింగ్ ఎల్లోసా, సమత, ప్రసన్న, సత్యనారాయణ రెడ్డి, నీలిమా, లక్షణ చక్రవర్తి, పాత నాగరాజు, పీఆర్‌వో పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల వేట.. ప్రాణాలతో ఆట



గోదావరిలో వరద గేట్ల వైపు తెప్పలపై వెళ్తున్న జాలర్లు

బాల్కొండ: మత్స్యకారుల అనాలోచిత చర్యలతో ప్రాణాలు పోతున్న తీరు కలవరానికి గురిచేస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల ఎదుట గోదావరిలో జాలర్లు ప్రాణాలు పోతున్నా వేట మానడం లేదు. గత శనివారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు గేట్ల ఎదుట చేపల వేటకు వెళ్లి గోదావరిలో గల్లంతయ్యారు. అందులో ఒకరు ప్రాణాలతో బయటపడగా మరొకరు నీటమునిగి కొట్టుకుపోయారు. ఈ ఘటన జరిగి వారం గడవకముందే మళ్లీ వరద గేట్ల ఎదుట గోదావరిలో బుధవారం జాలర్లు వేట సాగించారు. ఉదయం 9 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండగా ప్రవాహంలోనే చేపల వేట కొనసాగించారు. వరద గేట్ల ఎదుట చేపలు వేటాడకుండా ఎవరూ చర్యలు చేపట్టడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వరద గేట్ల ఎదుట ప్రవాహం సమయంలో చేపలవేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సేటు చెప్పిందే రేటు..

- ప్రారంభం కాని మక్కల కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్న రైతులు
- లాభపడుతున్న దళారులు



వెల్మల్ గ్రామ సమీపంలో మక్కలను ఆరబెడుతున్న మహిళా రైతు



వెల్మల్‌లో ఎండబెట్టిన కంకులు

నందిపేట్(ఆర్మూర్): మొక్కజొన్న పంట చేతికొచ్చినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఒకపక్క వర్షం మరోపక్క రోజురోజుకు తగ్గుతున్న ధరలతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకే మక్కలను అమ్ముకుంటూ నష్టపోతున్నారు. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 52,093 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఇప్పటికే అన్నిచోట్లా మక్క కోతలు ప్రారంభమయ్యాయి. అయితే, కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మక్కలను ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

వ్యాపారుల మాయ..

ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పంటను నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లే స్థోమత లేకపోవడంతో స్థానిక వ్యాపారులకే విక్రయిస్తున్నారు. అయితే, రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు ధరలను అమాంతం తగ్గిస్తున్నారు. 20 రోజుల కిందట క్వింటాలుకు రూ.2,500 చెల్లించి కొన్న వ్యాపారులు ప్రస్తుతం రూ.1900కే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా మద్దతు ధరను మించి అమ్ముడైన పంట ఈసారి తక్కువ ధర పలుకుతోంది. వారం రోజుల్లోనే క్వింటాలుకు రూ. 500 వరకు తగ్గడంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేనాటికి తమ పంట దళారులకు చేరుతుందని వాపోతున్నారు.

తక్కువ ధరకు అమ్ముకుంటున్నాం



మక్క పంటను అమ్ముకుందామంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. రోజు వర్షం పడడంతో మక్కలను ఆరబెట్టడం కష్టమవుతోంది. ఇదే అదనుగా చేసుకొని దళారులు తక్కువ ధరకు కొంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక దళారులకు అమ్ముకుంటున్నాం.

– అల్లెం గంగనర్సు, మహిళా రైతు,వెల్మల్ గ్రామం,

కేంద్రాలను ఏర్పాటు చేయాలి



మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పంట చేతికొచ్చి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఊసెత్తడం లేదు. కొన్ని రోజులుగా వర్షాల పడడంతో కష్టాలు పడుతున్నాం. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర ఇవ్వాలి.

– కుర్మె ధర్మన్న, వెల్మల్ గ్రామం

ప్రతిపాదనలు పంపించాం

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

– రంజిత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం, నిజామాబాద్

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ఏఎస్‌సీఐ



ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రమీదరెడ్డితో మాట్లాడుతున్న ఏఎస్‌సీఐ వైద్య బృందం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ) వైద్య బృందం బుధవారం సందర్శించింది. వైద్యులు హరికృష్ణ, రేష్మతోపాటు బృందం సభ్యులు ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, పరికరాలు, స్టాఫ్ హాజరు, శుభ్రత, రోగుల క్షేమం తదితర వాటి వివరాలను సేకరించారు. ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు, ఇతర సౌకర్యాలపై సూపరిటెండెంట్ ప్రమీదరెడ్డిను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి మెరుగుదల కోసం సిఫార్సులతో కూడిన నివేదికను రాష్ట్ర ఆరోగ్య శాఖకు అందజేస్తామని బృందం సభ్యులు తెలిపారు. వారి వెంట వైద్యులు అమృత్‌రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, అజయ్ తదితరులు ఉన్నారు.

13న పోలీస్ స్టోర్స్ సామగ్రి వేలం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ ఏఆర్ స్టోర్ కార్యాలయంలోని సామగ్రికి వేలం నిర్వహిస్తున్నట్లు సీపీ సాయిచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొని స్టోర్స్ కార్యాలయంలోని విడిభాగాలను సొంతం చేసుకోవాలని తెలిపారు. వేలంలో పోలీస్ కార్బోనైట్ లాఠీ, షీల్డ్స్, ప్లాస్టిక్ హెల్మెట్స్, బాడీ ప్రొటెక్టర్స్, స్టీల్ చైర్స్, చైర్స్, బెల్ హిల్లర్స్, టార్చ్ లైట్స్, వెబ్ సీలింగ్స్, హ్యాండ్ కప్స్, ఐరన్ (లీడింగ్ చైర్స్), వుడెన్ టేబుల్ చైర్స్, బెంచీలు, స్టూల్స్, ర్యాక్స్, బాక్సులు ఉన్నాయని పేర్కొన్నారు.

ఆనకట్టపై మక్కల ఆరబోత



ఎస్సారెస్పీ ఆనకట్టపై ఆరబెట్టిన మక్కలు

బాల్కొండ: ఆరుగాలం శ్రమించి పండించిన మక్క పంటల ఆరబోత రైతులకు ఇబ్బందికరమవుతోంది. నూర్పిళ్ల అనంతరం వర్షాలు వెంటాడుతుండటంతో మక్కలను ఆరబెట్టేందుకు కల్లాలు, రోడ్లు సరిపోవడం లేదు. దీంతో రైతులు ఎస్సారెస్పీ ఆనకట్టను ఆశ్రయిస్తున్నారు. ముప్కాల్, నల్లూర్, కొత్తపల్లి, బస్సాపూర్, సోన్‌పేట్ తదితర గ్రామాలకు చెందిన రైతులు మక్కలను ఆరబెట్టేందుకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆనకట్ట వరకు తరలిస్తున్నారు. అయితే, మక్కల ఆరబోతతో పర్యాటకులకు కొంత మేర ఇబ్బంది కలిగినా అన్నదాతల అవస్థలను దృష్టిలో ఉంచుకొని సర్దుకుపోతున్నారు.

'స్థానిక' ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈసీ నిబంధనలు పాటించాలి
- సీపీ సాయిచైతన్య ఆదేశం



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర అంశాలపై బుధవారం పోలీసులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తక్షణమే కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. కమిషనరేట్‌లో ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, అందులో అనుభవజ్ఞులైన అధికారులు, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. గత ఎన్నికల ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల నేరస్థులు, రౌడీ షీటర్లను రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని సూచించారు.

రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్లొద్దు..

సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లరాదని ప్రజలకు సూచించారు. ఈ నిబంధన ఉల్లంఘిస్తే నగదు మొత్తాన్ని సీజ్ చేయాలని సీపీ సాయిచైతన్య పోలీసులను ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ పూర్తయ్యేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎలక్షన్ సెల్ సీఐ వీరయ్య, సీఐలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు

క్రైం కార్నర్

అడవిపంది దాడిలో మహిళకు గాయాలు



గాయపడిన ఏసవ్వ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన సత్యంగారి ఏసవ్వపై అడవిపంది దాడి చేసినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. ఏసవ్వ పొలానికి వెళ్తున్న సమయంలో అడవిపంది దాడి చేసింది. దీంతో ఆమె కాలు విరిగింది. గాయపడిన ఏసవ్వను ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు కామారెడ్డికి రిఫర్ చేశారు.

ఇసుక వాహనం సీజ్



దోంగ్లీ వద్ద పట్టుకున్న ఇసుక వాహనం

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని కుర్లా సమీపంలో ప్రభుత్వ ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బోలెరో వాహనాన్ని బుధవారం ఉదయం పట్టుకున్నట్లు డోంగ్లీ ఆర్ఐ సాయిబాబా తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇసుక అక్రమ తరలింపుపై తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రభుత్వ క్వారీ వద్ద ఉన్న ఇసుక కుప్పల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను డంప్ చేసుకొని వెళ్తుండగా డోంగ్లీలో పట్టుకున్నామన్నారు. వాహనాన్ని డోంగ్లీ తహసీల్ కార్యాలయానికి తరలించామని తెలిపారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి



వేల్పూర్ కేసీఆర్ కాలనీవాసులకు కాంగ్రెస్ బాకీ కార్డులను అందజేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, బాకీ ఉన్న హామీలను కాంగ్రెస్ బాకీ కార్డు రూపంలో ప్రజలందరికీ చేరవేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వేల్పూర్ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో బుధవారం ఆయన కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతామని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేస్తే ఆ ఓట్లు మురిగిపోతాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలు పడితే అంతే సంగతి!



డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి బీసీ గురుకుల పాఠశాలలో డ్రెయినేజీ నీటితో ఏర్పడిన లోతైన కందకం ప్రమాదకరంగా మారింది. పిల్లలు ఆడుకుంటూ అటువైపు అనుకోకుండా వెళ్లి జారి పడితే ప్రాణాలు పోయే ప్రమాదముంది. కందకాన్ని పూడ్చేయాలని చాలా సార్లు అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

– డొంకేశ్వర్(ఆర్మూర్)